క్లుప్తంగా

విద్యార్థిని భావనకు సన్మానం


భావనను సన్మానిస్తున్న దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన భావన ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరరెడ్డి సోమవారం విద్యార్థిని భావనను ఘనంగా సన్మానించాడు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి రాష్ట్రస్థాయిలో విద్యార్థిని భావన రెండవ ర్యాంకు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో రేణిగుంట మండలం మామండూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను సూపర్‌వైజర్ హేమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహార ప్రాముఖ్యత, సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

ఏర్పేడు(రేణిగుంట): సమతుల పౌష్టికాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని రేణిగుంట ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణ మంజరి అన్నారు. ఏర్పేడు మండలం కొత్తవీరాపురంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె పాల్గొని పౌష్టికాహార విలువలను గురించి వివరించారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పొంది, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు నాగభూషణమ్మ, శారద, వైష్ణవి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

సత్యవేడు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ రవి కోరారు. సోమవారం బీసీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం మణి, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఆటోవాలా.. హామీ అటకెక్కినట్లేనా ?

- ఆటో, టిప్పర్, ట్యాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు అందిస్తామన్న కూటమి నేతలు
- అధికారం చేపట్టి 11 నెలలు అవుతున్నా ఊసెత్తని సర్కారు
- పెరిగిన జరిమానాలు, ఆర్టీఏ, పోలీస్ దాడులు
- సంక్షేమ బోర్డు ఊసెత్తని సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో ఏటా రూ.10 వేలు ఆసరా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఆటో, టిప్పర్, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థికసాయం అందిస్తాం.. ఈపీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తాం.. పెరిగిన ఇంధన ధరలను తగ్గిస్తాం.. అంటూ కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో హోరెత్తించారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు దాటిపోతున్నా వారికిచ్చిన హామీపై సర్కారు కిమ్మనడం లేదు. పైపెచ్చు కొత్త జీఓల పేరిట ఆర్టీఏ, పోలీస్ దాడులు పెరిగేలా చేసి వారి పొట్ట కొట్టడంలో కూటమి సీఎం చంద్రబాబు సక్సెస్ అయ్యారు.

వరదయ్యపాళెం: ఎన్నిలకు ముందు ఒక మాట.. తరువాత మరో మాట చెప్పడం.. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడం టీడీపీ అధ్యక్షుడు.. సీఎం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య. అధికారం కోసం ఎన్నికలప్పుడు అడ్డదిడ్డమైన హామీలివ్వడం .. అధికారం చేపట్టగానే కుంటిసాకులు.. ఊకదంపుడు ప్రసంగాలతో పక్కదారి పట్టించడం తొలి నుంచి ఒకటే వ్యవహార శైలి. ప్రజలను పదేపదే మోసం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని ప్రతిసారీ నిరూపించుకుంటూ వస్తున్నారు. 2014లో ఆరు వందలకు పైగా హామీలు ఇచ్చి, మాయమాటలు చెప్పి తప్పిన విషయం తెలిసిందే. 2024లో కూడా అదే రీతిలో హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టాక కుంటుసాకులు వెతుకుతూ ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నమ్మిన ప్రజలను పూర్తిగా మోసం చేస్తున్నారు. హామీలు అమలుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. పలు వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేం తీరని మండిపడుతున్నారు.

ఆటోడ్రైవర్లకు భరోసా ఏదీ..!

డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహన కొనుగోళ్లకు రూ.4 లక్షల వరకు పొందే రుణాలపై 5 శాతం పైగా వడ్డీ సబ్సిడీ.. బ్యాడ్జీ కలిగిన ప్రతి ఆటో డ్రైవరు, ట్యాక్సీ, హెవీ లైసెన్స్ కలిగిన ప్రతి లారీ, టిప్పర్ డ్రైవర్‌కు ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మేనిఫెస్టోలో పెద్దపెద్ద అక్షరాలతో పొందుపరిచారు. వీటిలో ఏ ఒక్క హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 2025–26 వార్షిక బడ్జెట్లో కూడా ఆటో డ్రైవర్ల ఆర్థిక సహాయానికి సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించలేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణనలోకి తీసుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సహాయం ఇవ్వాల్సిందేనని ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన అపరాధ రుసుం..

కూటమి ప్రభుత్వం సహాయం చేయకపోగా.. వివిధ రకాల పేర్లతో అపరాధ రుసుం విధిస్తూ తమపై ఆర్థికభారం మోపుతుందని డ్రైవర్లు మండిపడుతున్నారు. వెహికల్ ఫిట్‌నెస్ చార్జీలు రూ.1800 నుంచి రూ.3500లకు పెంచింది. ప్రయాణికులు ఏమాత్రం అధికంగా ఉన్న కేసులు పెడుతున్నారు.

గత ప్రభుత్వంలో ఐదేళ్లు అండగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేల ఆర్థిక భరోసా ఠంచన్‌గా ఆటో, ట్యాక్సీ, టిప్పర్ డ్రైవర్లకు అందించేవారు. ఈ మొత్తం వాహనాల మరమ్మతులతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందడానికి ఉపయోగపడేది. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలో ఏటా 767 కుటుంబాలకు వాహన మిత్ర ద్వారా ఆర్థిక సహాయం అందేది.

గత ప్రభుత్వంలో వాహనమిత్ర ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు

మండలం		లబ్ధిదారుల సంఖ్య
వరదయ్యపాళెం	-	151
సత్యవేడు	-	85
పిచ్చాటూరు	-	74
నాగలాపురం	-	73
బీఎన్‌కండ్రిగ	-	116
కేవీబీపురం	-	103
నారాయణవనం	-	165

ఇచ్చిన హామీ అమలు చేయాలి..



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రూ.15 వేల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిని నమ్మి ఓటు వేశాం. ఇంతవరకు ఈ పథకం గురించి ఎటువంటి ప్రకటనా రాలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు ఖాతాల్లో డబ్బులు జమచేయాలి. పెరిగిన అపరాధ రుసుం నుంచి ఉపశమనం కల్పించాలి.

–పురుషోత్తం, ఆటో డ్రైవర్, వరదయ్యపాళెం మండలం

జగనన్న మేలు మరచిపోలేం..



గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో రూ.40 వేలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏటా రూ.15 వేలు ఇస్తామంటే నమ్మకంతో ఓటు వేశాం. ఇప్పటివరకు ఆటో డ్రైవర్లకు ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందజేయాలి. జగనన్న ఐదేళ్లలో చేసిన మేళ్లు ఇప్పటివరకు మరువలేకున్నాం.

–శంకర్, ట్యాక్సీ డ్రైవర్, వరదయ్యపాళెం

నోటీస్ బోర్డు

నారాయణవనం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీటీసీ సుమన్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొనే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో మంగళవారం సాయంత్రం తిరుపతికి చెందిన వెన్నెల కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతున్నట్లు సర్పంచ్ కందాటి మోహనప్రియ తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వారికి ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహిస్తారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సిమెంటు రోడ్లు ప్రారంభం

సత్యవేడు: మండలంలోని రేపల్లెవాడ దళితవాడలో రూ.5 లక్షలు, రాజగోపాలపురంలో రూ.2 లక్షలు ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన రెండు సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సిమెంటు రోడ్డు నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలని అధికారులను కోరారు. అంతకుముందు రాజగోపాలపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యతగా భోజనం తయారు చేసి వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు వెంటనే జీతాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న జనమాల గురవయ్య

శ్రీకాళహస్తి: పౌరసరఫరాల శాఖ హమాలీ కార్మికులకు వెంటనే జీతాలు ఇవ్వాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి జిల్లా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాళహస్తి పాయింట్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు నెలవారీ జీతాలు తిరుపతి జిల్లాలో మాత్రం 20వ తేదీపైన ఇస్తున్నారని, పక్కనే ఉన్న చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరుతో మిగిలిన జిల్లాల్లో 12వ తేదీనే చెల్లిస్తున్నారన్నారు. ఇదే విషయంపై తిరుపతి జిల్లా కలెక్టర్‌కు మూడు దఫాలు గ్రీవెన్స్ డే రోజున వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. అయినా తిరుపతి జిల్లా డీఎం స్పందించడం లేదని వాపోయారు. మరోవైపు 30వ తేదీనాటికి మూమెంట్ పూర్తి చేయాలని హమాలీలపై పని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా పెంచిన రూ.3 కూలికి సంబంధించిన అరియర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విడుదల చేసినప్పటికీ తిరుపతి జిల్లాలో మాత్రం ఆ ఫైల్ ముందుకు కదలడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సెక్రటరీ జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపీ, ఏఐటీయూసీ అధ్యక్షుడు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

25న మెగా జాబ్‌మేళా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న జరగనున్న జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టరును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. సోమవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సత్యవేడు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి, దాస్ కళాశాల కరస్పాండెంట్ పరంధామ ఆధ్వర్యంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే స్థానిక నేతలు, అధికారుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాస్ సైన్సు కళాశాలలో నిర్వహించే ఈ ఉద్యోగమేళాకు చెన్నై, శ్రీసిటీకి సంబంధించిన 16 కంపెనీల తరఫున సుమారు 800 మందికి పైగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ మురళి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ రామస్వామి, ఎంఈఓ రవి, పరమశివం(వీకేఎస్‌బాషా), చికెన్ చిన్నా(మురళి), రూపేష్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను కొనసాగించండి


వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మత పెద్దలు

- ముస్లిం మతపెద్దల విన్నతి
- ఎంపీడీఓకు మెమోరాండం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలో 35 శాతం మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని ముస్లిం మైనార్టీ మతపెద్దలు కోరారు. రేణిగుంట పట్టణంలో ఉన్న ఉర్దూ పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉర్దూ విద్యార్థులను మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, తెలుగు ప్రైమరీ పాఠశాలకు బదలాయిస్తారన్న సమాచారంతో సోమవారం పట్టణంలోని ముస్లిం మత పెద్దలు ఎంపీడీఓ విష్ణు చిరంజీవిని కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణంగా మరో పాఠశాలకు విద్యార్థులను పంపించడం దారుణమన్నారు. పట్టణంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మత పెద్దలమైన తామంతా కలసి ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఉర్దూ పాఠశాలను మధ్యలో ఆపేస్తే విద్యార్థుల భవిత అంధకారంలోకి పడుతుందని ఆందోళన చెందారు. ఎంపీడీఓ సానుకూలంగా స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి ఉర్దూ పాఠశాలను కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు జీకే మునీర్, రహంతుల్లా, జాకీర్ హుస్సేన్, జిలాని, మహబూబ్ బాష, ముబారక్ మహాబాషా, సలీమ్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


మాట్లాడుతున్న హెచ్‌ఎం కస్తూరయ్య

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సోమవారం ఎంఈఓ బాబయ్య ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ రామచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే నాణ్యమైన విద్య అందుతుందని అందువల్లతల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఇటీవల జరిగిన ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 100 శాతం విజయఢంకా మోగించారని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 జనార్ధనరాజు, హెచ్‌ఎం కస్తూరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడు మృతి


మృతుడు సురేష్

సత్యవేడు: మండలంలోని దాసు కుప్పం కాలనీకి చెందిన శెల్వం కుమారుడు ఎస్.సురేష్(30) తండ్రి తిట్టాడని గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు.. దాసుకుప్పంకు చెందిన శెల్వం సంతలో కూరగాయలు అమ్మి జీవన సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు సురేష్ తండ్రికి సాయంగా కూరగాయల వ్యాపారంలో తోడుగా ఉండేవాడు. అయితే రోజూ మద్యం తాగుతూ బానిసయ్యాడు. వ్యాపారం చేయకుండా మందు తాగుతుండడంతో తండ్రి మందలించాడు. దీంతో తండ్రి తిట్టాడనే కోపంతో గడ్డి పెరగకుండా వాడే వాడే మందును ఆదివారం రాత్రి తాగేశాడు. సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నుంచి చెన్నై ఆర్‌జీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి తమిళనాడు వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

విశ్రాంత ఎస్‌ఐ కుటుంబానికి పరామర్శ


శ్రీనివాసులు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన విశ్రాంత ఎస్‌ఐ పర్వతాల శ్రీనివాసులు అనారోగ్యంతో సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు స్వర్ణమూర్తి, సాధనమున్నా, కంఠా ఉదయ్‌కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఆలయ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటమునిని గోశాల నుంచి ఆలయ అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, మరో జూనియర్ అసిస్టెంట్ సురేష్‌రెడ్డిని గోశాలకు బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ శారదాదేవి డిస్పాచ్ సెక్షన్, ఈ ఆఫీస్‌కు, అలాగే డోలు, సన్నాయి విద్వాంసులు కిషోర్‌ను ఆలయం నుంచి వరదరాజస్వామి టెంపుల్‌కు, అక్కడ పనిచేస్తున్న శరవణను ఆలయానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. సోమశేఖర్‌ను (నాగస్వరం)ముఖ్య ఆలయం నుంచి ముత్యాలమ్మ ఆలయానికి, అక్కడ పనిచేస్తున్న మస్తాన్ భజంత్రీని ఆలయానికి బదిలీ చేయగా, మునిరామయ్య భజంత్రీని ప్రసన్న వరదరాజ ఆలయానికి.. అక్కడ పనిచేస్తున్న మోహన్‌కృష్ణను ముఖ్య ఆలయానికి బదిలీ చేశారు. అలాగే ఎస్టాబ్లిషన్ డిపార్ట్‌మెంట్‌కు రాజశేఖర్ ఫైల్స్ కరస్పాండింగ్, సెక్యూరిటీ, ఎస్పీఫ్, హోంగార్డ్స్‌కు బదిలీ అయ్యారు. అసిస్టెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌గా పనిచేస్తున్న సుదర్శన్‌ను కరస్పాండింగ్, సెక్యూరిటీ, ఎస్పీఫ్, హోంగార్డ్స్ ఆర్డీఐశాఖకు కేటాయించారు. ఈ బదిలీలలో పలువురిపై వైఎస్సార్‌సీపీ అనే ముద్ర వేసి బదిలీలు చేశారని.. అయితే ఈ విషయం బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్తలు పాటించినట్లు సమాచారం.

ఘనంగా ఊంజల్‌సేవ


ఉయ్యాలపై సేద తీరుతున్న సీతారాములు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం రామకృష్ణాపురం గ్రామంలోని శ్రీరాములవారి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా 16వ రోజు సోమవారం రాత్రి రాఘవేంద్ర దేవీ దంపతులు ఉభయ దారులుగా సీతరాముల ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ పూజారి సీతారాముల చిత్రపటాన్ని సుందరంగా అలంకరించగా మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు. అనంతరం ఉభయదారులు భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మునికృష్ణ, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమల సర్వీసు ప్రారంభం


తిరుమల-సత్యవేడు కొత్త సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సత్యవేడు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో తిరుమల-సత్యవేడు రెగ్యులర్ సర్వీసును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమలకు ఉన్న 8 సర్వీసులతో పాటు అదనంగా మరో సర్వీసును ప్రారంభించామన్నారు. డిపో పరిధిలో అన్నిసర్వీసులు సక్రమంగా నడపాలని ఆర్టీసీ డీఎంను కోరారు. రోడ్డు వసతి సక్రమంగా ఉన్న గ్రామాలకు బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎం కే.వెంకటరత్నం మాట్లాడుతూ తిరుమల సర్వీసు రోజు ఉదయం 7.30 గంటలకు సత్యవేడు నుంచి బయలుదేరుతుందన్నారు. డిపో పరిధిలో 48 సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాదు, బెంగళూరు లాంగ్ సర్వీసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీఐ మురళి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ రామస్వామి, వీకేఎస్ బాషా, చికెన్ చిన్నా(మురళి), రూపేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.నరేంద్రవర్మ, ఏఎంఎఫ్ శ్రీనివాసులు, ఎస్‌డీఐ సుధాకర్ రాజు, ఆర్టీసీ ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు ఎమ్మెల్యే వర్సెస్ పరిశీలకుడు

- సత్యవేడు టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు
- ఎమ్మెల్యే ఆదిమూలంకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు
- సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తి పోసుకుంటున్న ఇరువర్గాలు


సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతిబాబు

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికలకు ముందు పరిశీలకుడిగా వచ్చిన నేత ఎన్నికల తర్వాత కూడా ఆయన ఆధ్వర్యంలోనే అధికారులు, ఇతర పార్టీ నాయకులు పని చేయాలని హుకుం జారీ చేస్తూ స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలంకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే వర్గీయులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యేను కాదని పరిశీలకుడి వర్గం సీసీరోడ్డును ప్రారంభించడంతో వివాదం రేగింది. ఈ విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు. అయితే ఆయన ఎన్నికల అనంతరం కూడా నేటికీ పెత్తనం చెలాయిస్తున్నారు. దీన్ని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వర్గీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతేకాక చంద్రశేఖర్ నాయుడుకు అనుకూలంగా ఉన్న నాయుడుపేటకు చెందిన శ్రీపతిబాబును నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియమించినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఆయన సైతం ఏకంగా అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటుండడం స్థానిక ఎమ్మెల్యే వర్గానికి మింగుడు పడడం లేదు. అంతేకాక సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో గ్రావెల్, ఇసుక దోపిడీకి వారే కారణమని ఎమ్మెల్యే వర్గం ఆరోపిస్తోంది. అధికారులను సైతం తాము చెప్పినట్లే పని చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అటు ఎమ్మెల్యే వర్గీయులు, ఇటు నియోజవర్గ పరిశీలకుడి వర్గీయుల ఒత్తిళ్లతో అధికారులు సైతం విధులు నిర్వర్తించలేక తలలు పట్టుకుంటున్నారు.

నివాళులు



మృతుల స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మృతుల కుటుంబీకులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు ఇసుక ఘటనలో 16 మృతి చెందడంతో మండలంలోని మునగలపాళెంలో నిర్మించిన స్మారక స్థూపం వద్ద 8వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మృతుల కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. 2017 ఏప్రిల్ 21న ఇసుకపై ఉద్యమించేందుకు మునగలపాళెం, ముసలిపేడుకు చెందిన రైతులు ఏర్పేడు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి లారీ ప్రమాదానికి గురై 16 మంది దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. వీరి వీరమరణానికి చిహ్నంగా మునగలపాళెం వద్ద ఏర్పాటు చేసిన స్మారక స్థూపం వద్ద సోమవారం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.